## క్లుప్తంగా

### రేపు వేటూరి జయంతి సభ

విజయవాడ కల్చరల్: గీతాంజలి మ్యూజిక్స్, దామోదర జానపదం, సుశీల్ మీడియా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ గేయ రచయిత, తెలుగు భాషా సేవకుడు వేటూరి సుందరరామమూర్తి జయంతి సభ నిర్వహించనున్నట్లు వేటూరి పాటల పరిశోధకుడు, గీతాంజలి మ్యూజిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని వేటూరి విగ్రహం వద్ద పుష్పాంజలి కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, సుప్రీం కోర్ట్ న్యాయవాది డాక్టర్ జీవీఎన్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్, జానపద గాయకుడు దామోదర గణపతిరావు పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం జరిగే కార్యక్రమంలో సాయి మాధవ్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### 5 నుంచి టైలరింగ్, బ్యూటీషియన్‌లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళల సాధికారత సాధనకు ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం 10 గంటలకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులో రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బ్యూటీషియన్‌లో ప్రతి రోజు ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, టైలరింగ్‌లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఇప్పటికే టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీల్లో అనేక బ్యాచ్‌లకు శిక్షణలు ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. ఆసక్తి కలవారు ఫిబ్రవరి 4వ తేదీలోగా ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో గానీ, 0866 - 2578044, 94900 98021 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

### టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం దాతలు వెంకటకిషోర్, శర్వాణీ, భవానీ, నాగజనార్దన్ సహకారంతో 600 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కల్యాణ మండపంలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. టీటీడీ స్థానిక అధికారి రామచంద్రరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. టీటీడీ విక్రయశాలలో శ్రీవారి పూజకు ఉపయోగించిన పూలతో తయారైన అగర్ బత్తిలను విక్రయించారు.

### తాజుద్దీన్‌బాబా జయంతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం అవధూత తాజుద్దీన్‌బాబా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను మందిర ప్రధాన కార్యదర్శి కే రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

### ప్రతిభావంతులకు ప్రోత్సాహకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురంలో శనివారం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇమేజ్ లయన్స్ మల్టీ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కేవీ రామారావు మాట్లాడుతూ తమవంతు సామాజిక బాధ్యతగా విద్యలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఓవీ శశిధర్, కోశాధికారి కే మాధవీలత పాల్గొన్నారు.

### వెబ్‌సైట్‌లలో ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజమహేంద్రవరం ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు (జోన్ 2 ) పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదిక నియామకాలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును జోన్ పరిధిలోని అన్ని జిల్లాల వెబ్‌సైట్‌లలో ఉంచినట్లు రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి. పద్మశశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 29 నుంచి 31 లోగా రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయానికి వ్యక్తిగతంగా గానీ, మెయిల్ ద్వారా కానీ తెలియచేయవచ్చన్నారు.

# నగర వాసులకు ఓపెన్ డయాస్

- గులాబీతోటలో ఏర్పాటు
- ఉచితంగా శుభకార్యాల నిర్వహణ
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గులాబీతోటలో నిర్మించిన ఓపెన్ డయాస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర వాసులు శుభకార్యాలు ఉచితంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం గులాబీతోటలో ఓపెన్ డయాస్ నిర్మించింది. ప్రజలు శుభకార్యాలు జరుపుకొనేందుకు అవసరమైన కల్యాణ మండపం లేకపోవడంతో కొంత మంది రోడ్లపైన మరికొంత మంది దూరప్రాంతాలకు వెళ్లి జరుపుకోవాల్సి వస్తుంది. దీంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు అందరికీ అందుబాటులో ఉండేలా సువిశాలంగా గులాబీతోట కాలువ గట్టు ప్రాంతంలో ఓపెన్ డయాస్ నిర్మింప చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే గులాబీతోట, దుర్గాపురం, భానూనగర్, మధురానగర్, చుట్టుగుంట తదితర ప్రాంత వాసులకు ఓపెన్ డయాస్‌లో ఎవరైనా ఉచితంగా శుభకార్యాలు జరుపుకోవచ్చని, కేవలం విద్యుత్ బిల్లు మాత్రం చెల్లించాలని అధికారులు తెలిపారు. ఇక్కడ సుమారు రెండు వేల గజాలకు పైగా స్థలం ఉండటంతో పార్కింగ్‌తో పాటు శుభకార్యాలు జరుపుకోవడానికి సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. ఓపెన్ డయాస్‌కు స్థానికుల విజ్ఞప్తి మేరకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టనున్నట్లు కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు.

**కాపు కల్యాణ మండపం పేరిట మోసం**

గులాబీతోటలో గత ప్రభుత్వ హయాంలో దాసరి నారాయణరావు కాపు కల్యాణ మండపం పేరిట ఎన్నికలకు ముందు హడావుడిగా అప్పటి హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా అప్పటి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అయితే కల్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన నిధులు మాత్రం మంజూరు చేయలేదు. కల్యాణ మండపం అందరూ ఉపయోగించుకోలేరనే ఉద్దేశంతో ఓపెన్ డయాస్ నిర్మించి ఉచితంగా శుభకార్యాలు నిర్వహించేందుకు అందిస్తున్నారు.

### గత ప్రభుత్వం మోసం చేసింది..



అందరికీ ఆమోదయోగ్యంగా ఓపెన్ డయాస్ నిర్మించడం సంతోషంగా ఉంది. ఎటువంటి చార్జీలు చెల్లించనవసరం లేకుండా ఓపెన్ డయాస్‌లో శుభకార్యాలు జరుపుకొనే అవకాశం కల్పించారు. గత ప్రభుత్వం కల్యాణ మండపం పేరిట మోసం చేసినప్పటికీ ఈ ప్రభుత్వంలో న్యాయం జరిగింది. పేద ప్రజలకు ఓపెన్ డయాస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

-యర్రంశెట్టి శ్రీను, స్థానికుడు

### మా కల నెరవేరింది



ఎట్టకేలకు ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం లభించింది. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఓపెన్ డయాస్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎంతో కాలంగా ఇక్కడ శుభకార్యాలు చేసుకునేందుకు అవసరమైన కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతున్నాం. ఇప్పటికి మా కల నెరవేరింది.

– మండా రాము, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు

## అధిష్టానం ఆదేశాలను శిరసా వహిద్దాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): అందరం అధిష్టానం ఆదేశాలను శిరసా వహించి పని చేస్తే విజయం వరిస్తుందని సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో శనివారం 62వ డివిజన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తాను సెంట్రల్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. సెంట్రల్‌లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటే అందరి భవిష్యత్ బాగుంటుందని పేర్కొన్నారు. కష్టపడి పని చేసేవారి కోసం ఎందాకైనా వస్తానన్నారు. మీ కుటుంబంలో ఒక సభ్యుడిగా నన్ను ఆదరించాలని వెలంపల్లి కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు అలంపూరు విజయ్‌కుమార్, రామిరెడ్డి, బోర బుజ్జి, సాంబయ్య, రమేష్, బ్రహ్మేంద్ర, హైమావతి, సావిత్రి, రెడ్డమ్మ, పద్మ, సాయి, ఖాదర్‌బీ, వెంకట్, సుభాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిభా పురస్కారం అందుకోవడం అభినందనీయం



ప్రతిభా పురస్కారం అందుకున్న వారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన నలుగురు సిబ్బంది కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా గణతంత్ర దినోత్సవాల్లో ప్రతిభా పురస్కారం అందుకోవడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి అన్నారు. కళాశాలలో శనివారం ప్రతిభా పురస్కారం అందుకున్న అధ్యాపకులు, సిబ్బంది అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభా పురస్కారం అందుకోవడం ద్వారా తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తక్కిన ఉద్యోగులు కూడా మరింత మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రతిభా పురస్కారం అందుకోవాలని ఆకాంక్షించారు. పురస్కార గ్రహీత అధ్యాపకులు డాక్టర్ బీ యుగంధర్, డాక్టర్ కే రమేష్, ఆఫీసు సిబ్బంది జీ మురళి, ఎం.కుమార్‌లను కళాశాల సిబ్బంది అభినందించారు.

## సంగీత సంప్రదాయాలను భావి తరాలకు అందించాలి



సంగీత కళాశాల గోడలమీద చిత్రాలు

విజయవాడ కల్చరల్: భారతీయ సంగీత నృత్య సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి అన్నారు. నగర సుందరీకరణలో భాగంగా నగరపాలకసంస్థ, కలెక్టర్ ఢిల్లీరావు చొరవతో దుర్గాపురంలోని ఘంటసాల నృత్య సంగీత కళాశాల గోడలమీద అద్భుతమైన చిత్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం సంగీత కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణవేణి మాట్లాడుతూ సంగీత కళాశాల విలువలను కాపాడటానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కళాశాల గోడల మీద సంగీత త్రిమూర్తులు, కూచిపూడి, భరతనాట్యం, కథక్ చిత్రాలతో పాటు సంగీత పరికరాలను చిత్రీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'సిద్ధం'తో పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం



సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'సిద్ధం' కార్యక్రమంతో పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోందని ఎమ్మెల్యే, సెంట్రల్ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. నందమూరినగర్‌లోని పార్టీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో 'సిద్ధం' వాల్ పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ప్రతిరోజూ ప్రజలతో ఉంటూ.. ప్రజల వెంటే నడిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన జగనన్న సారథ్యాన్నే రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, పెనుమత్స శిరీష, బాలిగోవింద్, అలంపూరు విజయలక్ష్మీ, ఉమ్మడి రమాదేవి, ఇసరపు దేవి, మోదుగుల తిరుపతమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 'పద్మ' పురస్కార గ్రహీతల సేవలు వెలకట్టలేనివి



అభినందన కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ రావు, చిట్టిబాబు, చంద్రశేఖర్ తదితరులు

విజయవాడ కల్చరల్: తెలుగు జాతికి వన్నెతెచ్చిన కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీతల సేవలు వెలకట్టలేనివని పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీతలు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సినీ నటుడు చిరంజీవి, పద్మశ్రీ గ్రహీత ఉమామహేశ్వరి అభినందన కార్యక్రమం విజయవాడ కళాసంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని మార్నింగ్ బెల్స్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా పురస్కారాలను ప్రదానం చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, దేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, ప్రసూనా రామన్, ప్రిన్స్ పాల్గొన్నారు.

### శభాష్ తులసీచైతన్య



అంతర్జాతీయ స్విమ్మర్ తులసీచైతన్యను అభినందిస్తున్న ఎంపీ కేశినేని నాని

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయంగా ఆరు జలసంధులను ఈది, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన టెంజింగ్ నార్గె నేషనల్ అడ్వెంచర్ అవార్డును అందుకున్న స్విమ్మర్ తులసీ చైతన్యను కేశినేని భవన్‌లో ఎంపీ కేశినేని శనివారం అభినందించారు. తులసీచైతన్య నగర వాసి కావడం విజయవాడకే గర్వకారణమన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి ఆరు జలసంధులను ఈది విజయవాడ ఖ్యాతిని నలుదిశలా చాటాడని కొనియాడారు. జిల్లా పోలీస్ పోలీస్ కమిషనరేట్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. మరో వైపు ప్రపంచ స్విమ్మర్‌గా గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి విజయవాడ ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు.

### పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌కు చెందిన సాయి మణికంఠ కేటరర్స్ అధినేత జే రమేష్‌బాబు సత్యనారాయణపురం ఏకేటీపీ నగరపాలకసంస్థ పాఠశాలకు శనివారం మైక్‌సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్న పాఠశాలకు తనవంతు బాధ్యతగా మైక్‌సెట్‌ను అందజేస్తున్నానని తెలిపారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టీ ప్రకాష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు అంబటి వెంకటేశ్వరరావు, తెన్నేటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జమున నటన భావితరం నటీమణులకు ఆదర్శం



విజయవాడ కల్చరల్: సినీ నటి జమున నటన భావితరం నటీమణులకు ఆదర్శమని కళాభారతి శ్రీమతి జమున కళాపీఠం వ్యవస్థాపకుడు గడ్డం లక్ష్మణరావు అన్నారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం జమున వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జమున బహుభాషానటిగా అభివర్ణించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కే నాగేశ్వరరావు, బొత్సా సూర్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, కే సాంబశివరావు, లింగం గౌరిశంకర్, కృష్ణమోహన్ జమున సేవలను వివరించారు. అనంతరం జమున చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు.

### వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌కు ప్రతిభా పురస్కారం



కలెక్టర్ ఢిల్లీరావు చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న రామకృష్ణ, డాక్టర్ హుస్సేన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విధినిర్వహణలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గానూ ముత్యాలంపాడు పశువైద్యశాల వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ జీ రామకృష్ణకు ప్రతిభా పురస్కారం లభించింది. గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

**జిల్లా సైన్స్ అధికారికి ఉత్తమ అవార్డు**

పాయకాపురం(విజయవాడరూరల్): జిల్లా సైన్స్ అధికారి, పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. శుక్రవారం గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా అవార్డును హుస్సేన్ స్వీకరించారు.

## మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలి



25వ డివిజన్‌లో కాల్వగట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీకి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమం శనివారం 25వ డివిజన్ పరిధిలో జరిగింది. స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి డివిజన్‌లోని చుట్టుగుంట తదితర ప్రాంతాల్లో వెలంపల్లి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై రూపొందించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ డివిజన్‌కు వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ప్రతీ ఇంటిలో జగనన్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరిందని చెబుతున్నారన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా తిరిగి జగనే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

**భూ కబ్జాలు, దందాలే**

మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుకు భూ కబ్జాలు, దందాలు మాత్రమే తెలుసని వెలంపల్లి విమర్శించారు. బోండా ఉమాకు ఎందుకు ఓటేయాలని ప్రజలే ప్రశ్నిస్తున్నారని ఐదేళ్ల ఎమ్మెల్యేగా పనిచేసి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. బోండా ఉమాకు భయం పట్టుకుందని, ఓటు కోసం రోడ్డుమీద తిరుగుతున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని బోండా ఉమాకు ఇప్పటికే అర్థమైందన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోసారి విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఎమ్మెల్సీ ఎండీ రూహుల్లా, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రూప్–2 పరీక్షలకు పూర్తి అవగాహనతో సన్నద్ధం కావాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన పుస్తకాలను ఆవిష్కరించిన జమల పూర్ణమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అభ్యర్థులు పూర్తి అవగాహనతో గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు శనివారం గ్రూప్–2 అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు చిన్న చిన్న పొరపాట్లు చేసి మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోతున్నారని తెలిపారు. గ్రూప్–2 సిలబస్‌ను దృష్టిలో ఉంచుకొని నిబద్ధతతో చదివి పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగాలను పొందాలని కోరారు. అభ్యర్థులందరూ స్టాండర్డ్ బుక్స్‌ను చదివితే తప్పకుండా విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం నూతనంగా ముద్రించిన తెలుగు అకాడమీ పుస్తకాలను చదవాలన్నారు. వార్తా పత్రికలు క్రమం తప్పకుండా చదివి కరెంట్ అఫైర్స్ నోట్ చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, భారత సమాజం స్టడీ మెటీరియల్ పుస్తకాలను జమల పూర్ణమ్మ ఆవిష్కరించారు. వీటిని విద్యార్థులందరికీ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కే రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## లోక కల్యాణార్థం గణపతి హోమం



పూర్ణాహుతిలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు దంపతులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలో లోక కల్యాణార్థం చేపట్టిన గణపతి హోమం, నవగ్రహ, లక్ష్మీనరసింహ తదితర హోమాలు ఫలప్రదం కావాలని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక గాయత్రీ కల్యాణ మండపంలో శనివారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అన్ని వర్గాల ప్రజల క్షేమాన్ని కాంక్షిస్తూ మూడు రోజులుగా ఈ మహాయజ్ఞాన్ని తలపెట్టడం శుభ పరిణామమని మల్లాది విష్ణు అన్నారు. యాగ ఫలితాలు ప్రతిఒక్కరికీ దక్కాలని ప్రార్థించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్ప బలానికి దైవబలం కూడా తోడవ్వాలని ఆయన కాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, నాయకులు దోనేపూడి శ్రీనివాస్, వై సుధీర్‌బాబు, జేకే సుబ్బారావు, చల్లా సుధాకర్, ఎస్ శ్రీనివాస్, కే రత్నకుమార్, కోలవెన్ను కొండా, ఎం.సత్యశ్రీహరి, కొప్పరపు మారుతి, చామర్తి మూర్తి, పి.సనత్, భక్తులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి, అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి, నగరపాలకసంస్థ సీఎంహెచ్‌ఓ డాక్టర్ రత్నావళి సూచించారు. 30వ డివిజన్ దేవీనగర్‌లో శనివారం నగరపాలకసంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యాన దోమల నివారణ స్పెషల్ డ్రైవ్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు నీటి నిల్వల్లో పెరుగుతాయని కావున ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం నీటినిల్వ ప్రాంతాల్లో గంబూసియా చేపలు, ఆయిల్ బాల్స్ వేసి ఫాగింగ్ చేశారు. మురుగు కాలువల్లో ఎంఎల్ఎల్ ఆయిల్ స్ప్రే చేయాలని రత్నావళి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ బయాలజిస్ట్ డీసీహెచ్ సూర్యకుమార్‌నాయక్, మలేరియా సూపర్‌వైజర్ బెనర్జీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జయరాజ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మేరీమాత తేరు ఊరేగింపు



మరియమాత తేరు ఊరేగింపులో వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని లబ్బీపేట క్యాథలిక్ సెంటర్ ఏసు తిరుహృదయ దేవాలయం ఆధ్వర్యంలో శనివారం మేరిమాత ప్రతిమతో ఊరేగింపు నిర్వహించారు. తొలుత కస్తూరిబాయిపేటలోని ఆర్సీఎం చర్చివద్ద మేరీమాతకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత పాల్గొన్నారు. మేరీమాత ప్రతిమకు వెల్లంపల్లి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణదల మేరీమాత ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. పుణ్యమాత రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలిగించాలన్నారు. అనంతరం అక్కడి నుంచి తేరు ఊరేగింపు రెడ్‌సర్కిల్, శిఖామణి సెంటర్, వాటర్‌ట్యాంక్ రోడ్డు, బాడవపేట, ఉడ్‌పేట, పీపీపీ రోడ్డు మీదగా జార్జిపేట నుంచి క్యాథలిక్ సెంటర్‌కు చేరుకుంది. దారి పొడవునా ప్రజలు మరియమాతను దర్శించుకున్నారు. రెవరెండ్ ఫాదర్ గాబ్రియేల్, మరియదళ సభ్యులు, ఉపదేశి తదితరులు పాల్గొన్నారు.